

ప్రేమంటే సులువు కాదురా.. అది మేము గెలిచామురా!
నేడు ప్రేమికుల రోజు సందర్భంగా జిల్లాలో ప్రేమించి పెళ్లి చేసుకున్న జంటలపై ప్రత్యేక కథనం - 8లో..



సింగిల్ విండో దరఖాస్తులు సకాలంలో పరిష్కరించాలి
ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి వచ్చిన సింగిల్ విండో దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. - 8లో..

వాతావరణం
గరిష్టం/కనిష్టం 33/22
ఉదయం పొగమంచు ఎక్కువగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

అదనంగా ధాన్యం కొనుగోలు చేయాలని కోరాం

సాక్షి ఎఫెక్ట్..

ఒంగోలు సిటీ: అదనంగా ధాన్యం కొనుగోలు చేయాలని ఉన్నతాధికారులను కోరామని జిల్లా సివిల్ సప్లయిస్ మేనేజర్ వరలక్ష్మి తెలిపారు. వరి రైతులకు మద్దతు ధర లభించకపోవడం, జిల్లాలో నామమాత్రంగా కొనుగోలు కేంద్రాలు నిర్వహించడంపై గురువారం సాక్షి దిన పత్రికలో ''వరి'ంచని మద్దతు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించి ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా 59,547 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని తెలిపారు. అందులో ఇప్పటి వరకూ 7,833 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. ఇందుకుగానూ రూ.17.79 కోట్లను రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు. అదనంగా కొనుగోలు చేసేందుకు జిల్లా అధికారుల ద్వారా సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఉన్నతాధికారులను కోరామన్నారు. అనుమతి రాగానే కొనుగోలు ప్రక్రియ చేపడతామని తెలిపారు.

పాఠశాలలపై ప్రభుత్వానికి వాస్తవ నివేదిక ఇవ్వాలి

- ఏపీ టీచర్స్ గిల్డ్ డిమాండ్

ఒంగోలు సిటీ: పాఠశాలల్లో వాస్తవాలను పరిశీలించి ప్రభుత్వానికి వాస్తవ నివేదిక ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో అధికారులను కోరారు. 98 ఎయిడెడ్ పాఠశాలలకు త్రీమెన్ కమిటీలు వేసినట్లు తెలిపారు. విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఎయిడెడ్ పాఠశాలల్లో వాస్తవ విద్యార్థుల సంఖ్యను పరిశీలించేందుకు ప్రతి ఎయిడెడ్ పాఠశాలకు ఉప విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో త్రీమెన్ కమిటీని జిల్లా విద్యాశాఖ అధికారి నియమించాలని విద్యాశాఖ కమిషనర్ వి.విజయరామరాజు తెలిపారన్నారు. ఎయిడెడ్ పాఠశాలల్లో యూడైస్ ప్రకారం విద్యార్థుల రోలుకు-వాస్తవ విద్యార్థులకు తేడా ఉన్నందున త్రీమెన్ కమిటీ వాస్తవ విద్యార్థుల సంఖ్యపై రిపోర్టు పంపాలని సూచించినట్లు చెప్పారు.

నాలుగు గంటలపాటు తులసీబాబు విచారణ

ఒంగోలు సిటీ : డిప్యూటీ స్పీకర్ రఘు రామరాజు కస్టడీకి సంబంధించి నమోదైన కేసులో అరెస్టయిన గుడివాడ టీడీపీ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము బంధువు తులసీబాబును ఒంగోలు పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. గురువారం ఒంగోలు ఎస్పీ కార్యాలయానికి తరలించారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఒంగోలు తీసుకొచ్చి కాసేపు తాలూకా పోలీసు స్టేషన్లో ఉంచారు. 2 గంటల తర్వాత ఎస్పీ కార్యాలయానికి తీసుకెళ్లారు. నెలవారీ నేర సమీక్ష సమావేశంలో బిజీగా ఉన్న ఎస్పీ దామోదర్.. 6 గంటల తర్వాత తులసీబాబును విచారించడం ప్రారంభించారు. సుమారు 3.30 గంటల పాటు విచారణ జరిగింది. అనంతరం తులసీబాబును తాలూకా పోలీసు స్టేషన్‌కు తరలించారు. రేపు ఉదయం వైద్య పరీక్షల అనంతరం గుంటూరు తరలించనున్నారు.

ఎలక్ట్రీషియన్ హెల్పర్ కోర్సులో ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఒంగోలు నాక్ శిక్షణ సంస్థలో ఎలక్ట్రీషియన్ హెల్పర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి జె.రవితేజయాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 3 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. 10వ తరగతి చదివిన నిరుద్యోగ యువకులు అర్హులన్నారు. శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తామన్నారు. ఈ నెల 19వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని, ప్రతిరోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ శిక్షణ ఉంటుందని అన్నారు. పూర్తి వివరాలకు 96522 82636 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సరుకులివ్వం..
ఎవరికి చెప్పకుంటారో చెప్పకోండి...

జనవరి, ఫిబ్రవరి నెలల్లో రేషన్ సరుకుల పంపిణీకి సంబంధించి ఒంగోలు నగరంలోని 9వ డివిజన్లో అసలు ఒక్క బియ్యం గింజ కూడా పంపిణీ చేయలేదు. రేషన్ సరుకులు ఎప్పుడిస్తారని అడిగితే.. 'ఇవ్వము ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి' అని బెదిరింపులకు పాల్పడుతున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. 'మాదే అధికారం.. మేము చెప్పిన మాట వినాలి.. లేకపోతే మీ రేషన్ కార్డు తొలగిస్తాం' అంటూ హుకుం జారీ చేస్తున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే కరువయ్యారు. జిల్లా కేంద్రంలోనే ఇలా ఉంటే.. ఇక, క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక్క ఒంగోలులోనే కాకుండా దాదాపు జిల్లావ్యాప్తంగా ఇదే తంతు నడుస్తోంది.



గింజకున్నానసరే.. నల్ల బజారుకే!

- కూటమి నేతల గుప్పెట్లో రేషన్ దుకాణాలు
- లబ్ధిదారులకు అందని బియ్యం, చక్కెర, కందిపప్పు
- సరుకులు ఇవ్వమంటే బెదిరింపులకు దిగుతున్న వైనం
- సర్వర్ పనిచేయడం లేదంటూ సాకు
- ఒంగోలు నగరంలో పరిస్థితి దారుణం
- ఫిర్యాదులు చేసినా స్పందించని అధికారులు
- మామూళ్ల మత్తులో జోగుతున్నారంటూ ఆరోపణలు

ఒంగోలు సిటీ: పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ భారీగా జేబులు నింపుకుంటున్నారు కూటమి కేటుగాళ్లు. చక్కెర, కందిపప్పు, జొన్నలపై పూర్తిగా కన్నేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పథకం ప్రకారం రేషన్ డీలర్ల వ్యవస్థను తమ ఆధీనంలోకి తెచ్చుకుని అక్రమాలకు తెరతీశారు. అధికారం ఉందనే అహంకారంతో తమను ఎవరూ ఏమీ చేయలేరన్న ధీమాతో రేషన్ సరుకులను కార్డుదారులకు ఇవ్వకుండా బొక్కేస్తున్నారు. అదేమని అడిగితే బెదిరింపులకు దిగుతున్నారు. పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చోద్యం చూస్తుండటంతో అక్రమాలకు అంతేలేకుండా పోయింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎండీయూ వాహనాల ద్వారా బియ్యం, చక్కెర, కందిపప్పు, ఇతర సరుకులను లబ్ధిదారుడి ఇంటి వద్దకే తెచ్చి అందించారు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలోని చాలా ప్రాంతాల్లో కార్డుదారులే దుకాణాల వద్దకు వచ్చి తీసుకోవాలని డీలర్లు హుకుం జారీ చేస్తున్నారు. కార్డుదారులు సరుకులు అడిగితే సర్వర్ పనిచేయడం లేదనే సాకుతో మళ్లీ రావాలంటూ వెనక్కి పంపుతున్నారు. డీలర్ల వద్దకు తిరగలేక వృద్ధులు, దివ్యాంగులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఒంగోలు నగరంతో పాటు దర్శి, కనిగిరి, కొండపి, మార్కాపురం, గిద్దలూరు, ఎస్‌ఎన్ పాడు, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. చాలా మంది లబ్ధిదారులకు దుకాణం వద్ద వేలిముద్రలు తీసుకుని బలవంతంగా డబ్బు చేతిలో పెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 1,392 రేషన్‌షాపులు ఉన్నాయి. అంత్యోదయ అన్న యోజన కార్డులు 32,807, తెల్లకార్డులు 6,37,820 చొప్పున మొత్తం 6,70,627 కార్డులు ఉన్నాయి. కార్డుదారులకు 385 ఎండీయూ వాహనాలు, రేషన్ దుకాణాల ద్వారా ప్రతి నెలా 10,582 మెట్రిక్ టన్నుల బియ్యం, 351 మెట్రిక్ టన్నుల చక్కెర, 670 మెట్రిక్ టన్నుల కందిపప్పు పంపిణీ చేస్తున్నట్లు అధికారులు లెక్కలు చూపిస్తున్నారు. వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. వీటిలో దాదాపు 60 శాతం నల్లబజారుకు తరలిపోతోందన్న ఆరోపణలు ఉన్నాయి.

కనిపించని అధికారులు...

రేషన్ పంపిణీ వ్యవస్థలో అధికార కూటమి నేతలు మితిమీరిన జోక్యం చేసుకుని దందాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయినా సంబంధిత శాఖాధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. అవినీతికి పాల్పడుతున్న డీలర్లు, అధికార పార్టీ నేతల వద్ద కొంత మంది అధికారులు నెల మామూళ్లు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సరుకులు సక్రమంగా పంపిణీ చేయని డీలర్లపై ఈగ వాలకుండా అటు నియోజకవర్గ ముఖ్య నేతలు కాపు కాస్తుండగా, అధికారులు సైతం వారి సేవలోనే తరలిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది.

ప్రత్యేక బృందాలతో తనిఖీ

రేషన్ దుకాణాల్లో అక్రమాలు అరికట్టేందుకు చర్యలు తీసుకుంటాం. ఇందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తున్నాం. జిల్లాలో ఈ నెలకు సంబంధించి కందిపప్పు సరఫరా కాలేదు. కార్డుదారులందరికీ రేషన్ సరుకులు అందేలా చూస్తాం.
–సివిల్ సప్లయిస్ అధికారి, ప్రకాశం జిల్లా

ఒంగోలులో దుకాణాలు పంచుకుని మరీ...

నిత్యవసర సరుకులను పందికొక్కుల్లా మేసేందుకు కూటమి నాయకులు ఏమాత్రం వెనకాడటం లేదు. ఒంగోలు నగరంలో పరిస్థితి దారుణంగా ఉంది. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అండతో రేషన్ సరుకుల పంపిణీ వ్యవస్థను తమ గుప్పెట్లో పెట్టుకుని దందాలు చేస్తున్నారు. నగర వ్యాప్తంగా ఉన్న రేషన్ దుకాణాలను పంచుకుని మరీ దోచేస్తున్నారు. నగరంలో 64 దుకాణాలుండగా, ప్రతీ దుకాణం వద్ద కూటమి పార్టీలకు చెందిన నలుగురేసి చొప్పున నాయకులు వాటాలివ్వాలని బెదిరింపులకు దిగుతున్నారు. తొమ్మిదో డివిజన్‌లో అయితే ఇద్దరు నాయకులు రూ.10,000 చొప్పున వాటాలు పంచుకున్నారన్న ప్రచారం జరుగుతోంది.

అర్హులకే దుకాణాలు

- ఎస్సీ కార్పొరేషన్ దుకాణ సముదాయాలను పరిశీలించిన మాల కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్



ఎస్సీ కార్పొరేషన్ షాపుల వివరాలను పరిశీలిస్తున్న మాల కార్పొరేషన్ చైర్మన్

ఒంగోలు వన్‌టౌన్: ఎస్సీ కార్పొరేషన్ దుకాణ సముదాయాలలోని షాపులను అసలైన లబ్ధిదారులకే కేటాయించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్ తెలిపారు. బినామీలను గుర్తించి తొలగిస్తామని చెప్పారు. ఒంగోలు ఏబీఎం జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న ఎస్సీ కార్పొరేషన్ దుకాణ సముదాయాలను గురువారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం దుకాణాలలో ఉన్న వారితో మాట్లాడి స్వయంగా వివరాలు నమోదు చేసుకున్నారు. ఒంగోలు ఏబీఎం కళాశాల ఎదురుగా ఉన్న 10 దుకాణాలు, గోపీకృష్ణ సినిమా హాలు ఎదురుగా ఉన్న 12 దుకాణాల సముదాయాలు, కొండపిలో ఉన్న 10 దుకాణాలకు సంబంధించి పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీని ఆదేశించారు. సింగరాయకొండలోని పాత్రీకాంప్లెక్స్‌ను కూడా పరిశీలించినట్లు తెలిపారు. సింగరాయకొండలోని స్థలాన్ని పరిశీలించి పూర్తి నివేదిక ఇవ్వాలని అక్కడి తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ దుకాణదారుల వద్ద నుంచి రావాల్సిన దాదాపు 15 లక్షల రూపాయలకు పైగా అద్దె పెండింగ్‌లో ఉందని తెలిపారు. అసలు లబ్ధిదారులు బినామీ లబ్ధిదారుల వద్ద నుంచి నెలకు రూ.7 వేలకుపైగా అద్దె వసూలు చేస్తూ ఎస్సీ కార్పొరేషన్‌కు మాత్రం నెలకు రూ.500 అద్దెను కూడా గత 10 సంవత్సరాలుగా చెల్లించడం లేదన్నారు. వీటన్నింటిపై తగిన చర్యలు తీసుకుంటామని చైర్మన్ తెలిపారు. ఆయన వెంట ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పైకి పొత్తులు.. కడుపులో కత్తులు..!

- పవన్ కళ్యాణ్ తీర్థయాత్రలకు వెళ్లడమే కాదు.. దావోస్‌లోనూ లభించని చోటు
- యర్రగొండపాలెం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శ



నాయకులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: కూటమి ప్రభుత్వం ఏర్పడక ముందు అధికారం చేజిక్కించుకోవడానికి టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తులు పెట్టుకున్నాయని, ఈ పొత్తులు పైకి మాత్రమే కనిపిస్తున్నప్పటికీ కడుపులో మాత్రం కత్తులు పెట్టుకుని అధికారం చలాయిస్తున్నారని యర్రగొండపాలెం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. ఇటీవల జిల్లా స్థాయి పదవులు పొందిన నాయకులను గురువారం ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పుడు తీర్థ యాత్రలకు వెళ్లడమే కాదని, పెట్టుబడుల కోసం దావోస్ వెళ్లిన సమయంలో కూడా అక్కడ చోటు దక్కలేదని అన్నారు. ఇటీవల క్యాబినెట్‌తో జరిగిన అత్యంత కీలమైన బడ్జెట్ సమావేశంలో కూడా ఆయన పాల్గొనలేదన్నారు. ప్రస్తుతం ఉన్న మంత్రిత్వ శాఖల మధ్య సానుకూలమైన వాతావరణం లేక ఒకరిపై ఒకరు ఎత్తులకు పైఎత్తులు వేసుకుంటున్నారన్నారు. దీనివలన ప్రజాపరిపాలన గాడితప్పిందని, ప్రజా సంక్షేమాన్ని నీరుగారుస్తున్నారని, ప్రజా ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేశారని ఎమ్మెల్యే తాటిపర్తి మండిపడ్డారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వలేనటువంటి కూటమి ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలూ అస్తవ్యస్తంగా ఉన్నాయని ఆయన విమర్శించారు. ఫెయిలైనటువంటి లా అండ్ ఆర్డర్, కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులు వచ్చి పడుతున్నప్పటికీ పట్టించుకోని విద్యా శాఖ, మద్దతు ధరల కోసం మిర్చి రైతులు బజారుకు ఎక్కుతున్న సంఘటనలు, గుక్కెడు తాగునీటి కోసం రోడ్లపై చేస్తున్న ఆర్తనాదాలు, కరువైన మహిళా భద్రత, నడిరోడ్డు పక్కనే ఇసుక నిల్వ చేస్తున్న యార్డులు, పట్టెడన్నం కోసం ప్రభుత్వం ఇచ్చే పీడీఎస్ బియ్యం సైతం అక్రమ రవాణా, గంజాయితో పాటు విచ్చలవిడిగా పట్టుబడుతున్న మాదక ద్రవ్యాలు, రోజువారీగా క్షీణిస్తున్న జీఎస్టీ వసూళ్లు, కొండెక్కి కూర్చున్న నిత్యావసర ధరలు, సంక్రాంతి నాటికి పూర్తి చేస్తామన్నప్పటికీ అధ్వానంగా ఉన్న విలేజ్ రోడ్లు.. ఇంకా అనేక ఉదాహరణలు ఉన్నాయని ఎమ్మెల్యే వివరించారు. రూ.30 కోట్లకుపైగా నిధులు వచ్చినప్పటికీ యర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ హాస్టళ్ల నిర్మాణానికిగానీ, మరమ్మతులకుగానీ రూపాయి కూడా కేటాయించకపోవడం కూటమి ప్రజావ్యతిరేక విధానాలకు నిదర్శనమని ఆయన అన్నారు. హాస్టళ్లలో సీట్లు దొరక్క విద్యకు దూరమైన విద్యార్థుల ఘోషను కలెక్టర్‌కు వినిపించినా నిధులు కేటాయించలేదన్నారు. నియోజకవర్గంలోని అనేక ఎస్టీ తండాలకు రవాణా సౌకర్యం లేక గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కనెక్టివిటీ రోడ్లకు ఎటువంటి కేటాయింపులు లేకపోగా తాము పండించిన పంటను రవాణా చేసుకుంటుంటే అటవీశాఖాధికారులు అడ్డుకోవడంతోపాటు కేసులు నమోదు చేస్తున్నారని అన్నారు. పేదలను పట్టించుకోకపోవడం ఈ కూటమి ప్రభుత్వ లక్ష్యంలా ఉందని, హామీ ఇచ్చిన సూపర్-6 పథకాలను ఎగ్గొట్టడమే పనిగా పెట్టుకుందని తీవ్రస్థాయిలో ఎమ్మెల్యే తాటిపర్తి విమర్శించారు. విలేకరుల సమావేశంలో ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, జనరల్ సెక్రటరీ కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, యాక్టివిటీ సెక్రటరీ సింగా ప్రసాద్, ఆర్గనైజేషన్ సెక్రటరీ కె.జానకి రఘు, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, మండల పరిషత్ వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, ఏకుల ముసలారెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, ఎల్లారెడ్డి రోషిరెడ్డి, తమ్మినేని సత్యనారాణరెడ్డి, ఎ.కోటిరెడ్డి, ఎల్.రాములు, టి.కృష్ణారెడ్డి, చెంగళ నాగయ్య, కందుల సత్యనారాయణ చౌదరి, పబ్బిశెట్టి శ్రీనివాస్, వేముల రవణమ్మ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా 19న నిరసన

- విజయవంతం చేయాలంటూ వామపక్ష పార్టీల పిలుపు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నాయకులు

ఒంగోలు సిటీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ప్రజా వ్యతిరేక అంశాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 19వ తేదీ ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వామపక్ష పార్టీల నాయకులు తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్.కె.మాబు, సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకురాలు లలిత కుమారి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు కె.హనుమంతరావు పాల్గొని మాట్లాడారు. బీజేపీ పాలనలో ప్రజలలో కొనుగోలు శక్తి తగ్గిపోయిందన్నారు. ఆర్థిక వ్యవస్థలో తగ్గిన డిమాండ్ సమస్యను పరిష్కరించడానికి బదులు అందుకు విరుద్ధంగా మోదీ ప్రభుత్వం సంపన్నులకు రాయితీలు ఇవ్వడం, ఖర్చుల్లో కోత పెట్టడం దుర్మార్గమన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్యను బడ్జెట్ పూర్తిగా విస్మరించిందన్నారు. ఆహార సబ్సిడీలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమంపై పెట్టిన ఖర్చు గతేడాది కంటే బాగా తగ్గిపోయిందని అన్నారు. అవసరం ఉన్నప్పటికీ ఉపాధి హామీ పథకానికి అదనంగా నిధులు కేటాయించలేదన్నారు. ధరల పెరుగుదల, జీఎస్టీ పెంపుదలతో అనేక ఇబ్బందులు పడుతున్న కార్మిక వర్గాన్ని విస్మరించారన్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర అంశానికి చట్టపరమైన హామీ కల్పించాలని కోరారు. వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన ముసాయిదాను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నేషనల్ మానిటైజేషన్ పైపులైన్ ద్వారా చేపట్టే ప్రభుత్వ రంగ ప్రైవేటీకరణ చర్యలను, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు రంగానికి బదలాయించడాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డీఐలను ఉపసంహరించుకోవాలన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయించిన నిధులను 50 శాతం పెంచాలని, పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని కూడా ప్రవేశపెట్టాలని, వృద్ధాప్య పెన్షన్లు, ఇతర సామాజిక భద్రత ప్రయోజనాల కోసం కేంద్రం కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యంగా కేటాయింపులను జీడీపీలో మూడు శాతానికి పెంచాలని, విద్యారంగానికి జీడీపీలో ఆరు శాతం కేటాయింపులు పెంచాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆహార సబ్సిడీ పెంచాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ రంగాలకు, మహిళా, శిశు సంక్షేమానికి కేటాయింపులను గణనీయంగా పెంచాలని, వీటిల్లో ఐసీడీఎస్‌కు కూడా కేటాయింపులు పెరగాలని, అలాగే స్కీం వర్కర్లకు ఇచ్చే గౌరవ వేతనాల్లో కేంద్రం వాటా పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాలకు నిధుల బదిలీలు పెంచాలన్నారు. వీటన్నింటి కోసం ఈ నెల 19న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.వెంకట్రావు, సయ్యద్ యాసిన్, కె వీరారెడ్డి, సీపీఎం ఒంగోలు నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాపం.. దివ్యాంగులకు శాపం..!













ఒంగోలు జీజీహెచ్‌లో సదరమ్ క్యాంప్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు వచ్చి అవస్థపడుతున్న దివ్యాంగులు

ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలివ్వడం.. ప్రజలను నమ్మించి ఓట్లు దండుకుని అధికారంలోకి రావడం.. గద్దెనెక్కిన తర్వాత హామీలు అమలు చేయకుండా తప్పించుకోవడం సీఎం చంద్రబాబుకు పరిపాటిగా మారింది. అయితే, ఈసారి ఏకంగా అరకొరగా అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాల్లో కూడా కోత విధించేందుకు అడ్డదిడ్డమైన విధానాలు అవలంబిస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. చంద్రబాబు చేస్తున్న ఈ కుట్రలు ప్రస్తుతం దివ్యాంగుల పాలిట శాపాలుగా మారాయి. పెన్షన్ల సంఖ్యలో కోత విధించేందుకు కుట్ర పన్నిన కూటమి ప్రభుత్వం.. అంగవైకల్యం పర్సంటేజీని రీ వెరిఫికేషన్ చేయాలని తీసుకున్న నిర్ణయంతో వందల మంది దివ్యాంగులు సదరమ్ క్యాంపుల చుట్టూ తిరుగుతూ నరకం చూస్తున్నారు. నియోజకవర్గ కేంద్రాల్లో, ఒంగోలు జీజీహెచ్‌లో నిర్వహిస్తున్న ఈ శిబిరాలకు వచ్చి వైద్య పరీక్షలు, డాక్టర్ల సర్టిఫికెట్ల కోసం రోజంతా వేచి ఉంటూ నానా అవస్థలు పడుతున్నారు. దీనికితోడు సర్వర్లు పనిచేయకపోవడంతో రోజుల తరబడి తిరగాల్సి వస్తోందంటూ దివ్యాంగులు, వారికి సహాయకులుగా వస్తున్న కుటుంబ సభ్యులు తీవ్రస్థాయిలో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, దివ్యాంగులకు అంగవైకల్యానికి సంబంధించిన పర్సంటేజీలు ఎక్కువ వేసి పింఛన్లకు అర్హులను చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ప్రభుత్వ వైద్యులకు సర్కార్ నుంచి ఆదేశాలున్నట్లు వినికిడి. దీంతో నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహిస్తున్న సదరమ్ క్యాంపుల్లోని డాక్టర్లు తమకెందుకు లేనిపోని సమస్య అనుకుంటూ.. స్పెషలిస్టులు లేరనే కారణంతో ఒంగోలు జీజీహెచ్‌కి సిఫార్సు చేస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి ఒంగోలు తిరగలేక వృద్ధులు, దివ్యాంగులు అష్టకష్టాలు పడుతున్నారు.

– సాక్షి, ఒంగోలు

క్లుప్తంగా

ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి



వెంకటేశ్వర్లు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మహేంద్ర

జరుగుమల్లి(సింగరాయకొండ): మద్యం మత్తులో ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం ..వెలిగండ్ల మండలం నర్సమాంబపురం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ మాదిరెడ్డి వెంకటేశ్వర్లు(46) కామేపల్లిలోని పోలేరమ్మ తల్లి ఆలయంలో పూజలు చేయించుకున్నాడు. తిరుగు ప్రయాణంలో మద్యం సేవించి వాహనం నడపటంతో రోడ్డు మలుపువద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి రక్షిత మంచినీటి పైపులైన్ వాల్వ్ తొట్టిని ఢీకొని తలకు తీవ్ర గాయమవడంతో అక్కడికక్కడే మరణించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

నేడు రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ క్రీడా పోటీలు

ఒంగోలు సిటీ: ఒంగోలు మండలం కరవది పీఆర్ఆర్ జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు, క్రీడాకారుల ఆధ్వర్యంలో దివంగత సూరి గుచ్చి హనుమంతరావు జ్ఞాపకార్థం ఈ నెల 14 నుంచి 16 వరకు ద్వితీయ రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ పురుషులు, మహిళల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి విద్యుత్ దీప కాంతులతో పోటీలు నిర్వహిస్తామన్నారు. 16వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందన్నారు. రాత్రి 8 గంటలకు బహుమతుల ప్రదానం, క్రీడాకారులకు సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

స్నేహితుల మధ్య ఘర్షణ

సింగరాయకొండ: మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు స్నేహితుల మధ్య గురువారం పాఠశాలలో జరిగింది. ఈ గొడవలో ఇద్దరికి గాయాలయ్యాయి. విద్యార్థి నుదిటిపై పెన్నుతో మరొక విద్యార్థి గాయపరిచాడు. దీంతో ఆ విద్యార్థి నుదుటిపై రక్తస్రావం కావడంతో స్థానిక ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా అక్కడి నుంచి ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. విద్యార్థి నుదుటిపై గాయాలు ఉండటంతో డాక్టర్లు ఎక్స్‌రే తీసారని, కానీ బాగానే ఉందని, అతని మెడపై కూడా గోళ్లతో గీకినట్లు గాయాలు ఉన్నాయని జీజీహెచ్ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. వీరిద్దరు స్నేహితులు కాగా వీరిద్దరి మధ్య ఘర్షణ ఎందుకు తలెత్తిందో తెలియాల్సి ఉంది. దీనిపై పాఠశాల సిబ్బంది మాత్రం ఎటువంటి సమాచారం దొరక్కుండా జాగ్రత్త పడుతున్నారని తెలిసింది.

సహకార ఉద్యమాన్ని బలంగా తీసుకెళ్లాలి

ఒంగోలు సిటీ: జిల్లా మార్కెటింగ్ సహకార సంఘాలు సహకార ఉద్యమాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లి మరిన్ని సేవలందించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు. ప్రకాశం భవనంలో గురువారం జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. తొలుత జిల్లా సహకార అధికారి బి.శ్రీనివాసరెడ్డి సమావేశం ఆవశ్యకతను వివరించారు. ఈ నెల నుంచి డిసెంబర్ వరకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, జిల్లా మహిళా సమాఖ్య, చేనేత సహకార సంఘాలు, గొర్రెల పెంపకదార్ల సహకార సంఘాలు తగిన ప్రణాళికలు తయారు చేసుకొని అమలు చేస్తామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, పీడీసీసీ బ్యాంకు సీఈఓ బిందు ప్రత్యూష, నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి జె.రవికుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి పద్మశ్రీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రేమంటే సులువు కాదురా.. అది మేము గెలిచాముురా!



ప్రేమ.. అన్యోన్యమైన బంధానికి బాటలు వేస్తుంది. అయితే ఆ బాటలో సంతోషాలు, సరదాలే కాదు ఎన్నో ఒడిదొడుకులు, అయినవారిని ఎదిరించడాలు, గొడవలూ ఉంటాయ్. ప్రేమంటే సులువు కాదు మరి! ప్రేమించిన వ్యక్తికి దగ్గరవడానికి లౌక్యం, ప్రేమ కోసం పెద్దల్ని ఎదిరించడానికి ధైర్యం, ఇష్టమైనవారినే లోకంగా భావించి బయటకెళ్లి బతకడానికి తెగువ అవసరం. ప్రేమలో పడేది యువతి, యువకుడు కాదు.. ఒక మేల్ ఎనర్జీ, ఒక ఫీమేల్ ఎనర్జీ అని అంటారు ఇండియన్ ఫిలాసఫర్ ఓషో. ఆ రెండు శక్తులు మిలితమైతే గెలుపు కథలు పురుడు పోసుకుంటాయి. నేడు ప్రేమికుల దినోత్సవం.. ఈ సందర్భంగా ప్రేమ బంధాన్ని అందంగా మలుచుకున్న కొన్ని జంటలపై ప్రత్యేక కథనం..

- కొమరోలు/ఒంగోలు టౌన్

అనాథ పిల్లలకు అమ్మానాన్నలై..



ఆమె పేరు రాజ్యలక్ష్మి, ఆయన పేరు షేక్ ఖాశిం. వీరి ప్రేమ వివాహానికి 40 ఏళ్ల చరిత్ర ఉంది. డిగ్రీ చదువుకునే రోజుల్లో ప్రేమలో పడ్డారు. కానీ అందరిలాగా ఆలోచించి తొందరపడలేదు. ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం జీవితంలో స్థిరపడ్డాకే పెళ్లి చేసుకున్నారు. అదికూడా అంత సులువుగా జరగలేదు. ఆమె హిందువు, ఆయన ముస్లిం. ఇరు కుటుంబాలు వీరి పెళ్లిని వ్యతిరేకించాయి. దీంతో పెద్దలను ధిక్కరించి స్నేహితుల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. ఆనాడే మత విశ్వాసాలను పక్కన పెట్టి దండలు మార్చుకోవడం ద్వారా ఆదర్శంగా నిలిచారు. ఆ తర్వాత ఉద్యోగరీత్యా ఏడేళ్లపాటు వేర్వేరు జిల్లాల్లో విధులు నిర్వహించాల్సి రావడంతో ఒంటరితనాన్నీ అనుభవించారు. అనాథ పిల్లలను ఆదరించాలన్న ఆలోచనతో ఒక కుమారుడు పుట్టాక సంతానం వద్దనుకున్నారు. జీవితంలో కొంత స్థిరపడ్డాక బొమ్మరిల్లు అనాథాశ్రమం ఏర్పాటు చేశారు. తలిదండ్రులు లేని ఎంతో మందికి ఆశ్రయం కల్పించి చదివిస్తున్నారు. రాజ్యలక్ష్మి, ఖాశిం దంపతుల కుమారుడు డాక్టర్ సమీర్ శర్మ షేక్. ఆయన వివాహాన్ని కూడా ఒక హేతువాద కుటుంబానికి చెందిన యువతితో చేశారు. ఆ యువతి పేరు డాక్టర్ లియు హుల్లన్. చైనాలో స్వేచ్ఛ కోసం పోరాడిన ఉద్యమకారిణి పేరది.

ఒప్పించి ఒక్కటయ్యారు



☛ బీటెక్ వరకు ఎక్కడెక్కడో చదువుకున్న ఈ జంట ఎంటెక్‌లో తొలిసారి కలిసింది. వీరి మధ్య పరిచయం ప్రేమగా మారింది. కొమరోలుకు చెందిన పి.దామిని, తెనాలికి చెందిన జి.పవన్‌కుమార్ 2014లో గుంటూరు వద్ద గీతం యూనివర్సిటీలో ఎంటెక్ విద్యను అభ్యసించడానికి అడ్మిషన్ పొందారు. ఈ సమయంలో ఇరువురి మనసులు కలవడంతో ప్రేమ చిగురించింది. చదువు పూర్తయ్యాక మంచి ఉద్యోగాలు సంపాదించిన ఇద్దరూ 2019లో కుటుంబ సభ్యులకు చెప్పారు. ఇద్దరి కులాలు వేరు కావడంతో తొలుత తటపటాయించినా పిల్లల ప్రేమను ఆ తల్లిదండ్రులు అర్థం చేసుకున్నారు. 2019 ఫిబ్రవరి 24వ తేదీన ఘనంగా వివాహం నిర్వహించి ఆశీర్వదించారు. తల్లిదండ్రులను నొప్పించకుండా ప్రేమ వివాహం చేసుకున్న ఈ జంట ఒక అమ్మాయి, ఒక అబ్బాయితో హైదరాబాద్‌లో ఆనందంగా జీవిస్తోంది.



☛ కొమరోలు మండలం పురుషోత్తమునిపల్లె గ్రామానికి చెందిన కందుల విశ్వవిరాట్‌రెడ్డి 2008లో బీటెక్ చదివేందుకు బెంగళూరు వెళ్లాడు. ఈ సమయంలో మ్యూచువల్ ఫ్రెండ్స్ ద్వారా నంద్యాలకు చెందిన యాగేశ్వరితో పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారింది. అప్పుడు యాగేశ్వరి కూడా అక్కడే ఓ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. బీటెక్ తర్వాత సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా మంచి స్థాయిలో ఉన్న విశ్వవిరాట్‌రెడ్డి తన ప్రేమ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పగా అంగీకరించారు. యాగేశ్వరి కుటుంబ సభ్యులతో సంప్రదింపులు జరపగా తొలుత ససేమిరా అన్నారు. విరాట్, యాగేశ్వరి పట్టువదలకుండా పెద్దలను ఒప్పించి 2014 ఫిబ్రవరి 12న ఒక్కటయ్యారు. 11 ఏళ్ల అన్యోన్య దాంపత్యం సాగిస్తున్న ఈ జంటకు ఇద్దరు కుమారులు. బెంగళూరులో స్థిరపడిన విశ్వవిరాట్ తల్లిదండ్రులను తనతో పాటే తీసుకెళ్లాడు.

ఎస్సై పేరుతో నగదు కొట్టేసేందుకు స్కెచ్!

- వ్యాపారులు అప్రమత్తం కావడంతో ఫోన్ కట్



వ్యాపారులకు కాల్ వచ్చిన నంబర్

గిద్దలూరు రూరల్: 'నేను గిద్దలూరు ఎస్సైని మాట్లాడుతున్నా.. ఫోన్ పేలో రూ.10 వేలు కొట్టు మా కానిస్టేబుల్ వచ్చి క్యాష్ ఇస్తాడు' అంటూ వ్యాపారులను మోసం చేసేందుకు ఓ సైబర్ నేరగాడు యత్నించాడు. వివరాలు.. గిద్దలూరు పట్టణంలోని రాచర్ల గేటు సమీపంలో గల ఆరాధ్య మెడికల్ షాపు యజమాని రమణకు గురువారం ఓ వ్యక్తి 6305241524 నుంచి వాట్సప్ కాల్ వచ్చింది. వాట్సప్ డీపీలో తెలంగాణ పోలీస్ యూనిఫాం ధరించిన వ్యక్తి ఫొటో ఉండటంతో రమణ కాల్ ఆన్సర్ చేశాడు. మా కానిస్టేబుల్ వచ్చి మీకు రూ.10 వేలు ఇస్తాడు ముందుగా నాకు ఫోన్ పే కొట్టు అని అడిగాడు. తన వద్ద డబ్బు లేదు సార్ అని రమణ చెప్పడంతో అయితే పక్కనే ఉన్న కిరాణాషాపు రంగస్వామి వద్దకు వెళ్లి ఫోన్ పే కొట్టించు అంటు ఆర్డర్ వేశాడు. దీంతో రంగస్వామి వద్దకు వచ్చిన రమణ 'గిద్దలూరు ఎస్సై అంట.. ఫోన్ పేలో డబ్బు పంపితే కానిస్టేబుల్ వచ్చి ఇస్తాడంటా' అని చెప్పాడు. రంగస్వామికి అనుమానం వచ్చి తన వద్ద కూడా డబ్బు లేవు సార్ అని చెప్పడంతో ఆ వ్యక్తి ఫోన్ కాల్ కట్ చేశాడు. ఈ విషయమై స్థానిక సీఐ సురేష్ స్పందిస్తూ ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యాపారులకు వచ్చిన ఫోన్ కాల్‌పై విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

సింగిల్ విండో దరఖాస్తులు సకాలంలో పరిష్కరించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి సింగిల్ విండో ద్వారా అందిన దరఖాస్తులను నిర్దేశించిన సమయం లోగా పరిష్కరించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహిక కమిటీ సమావేశం గురువారం ప్రకాశం భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను పారిశ్రామిక రంగంలో ముందు వరుసలో ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కలుగుతాయని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సింగిల్ విండో పథకంలో జిల్లాలో 2024 డిసెంబర్ నుంచి ఫిబ్రవరి 2025 వరకు పరిశ్రమ ఏర్పాటుకు 437 దరఖాస్తులు అందగా, వాటిలో 421 దరఖాస్తులు ఆమోదించామన్నారు. పెండింగ్‌లో ఉన్న 16 దరఖాస్తులను గడువు లోగా పరిష్కారానికి ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి పీఎంఈజీపీ లక్ష్యాల మేరకు మంజూరు, గ్రౌండింగ్‌కు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పీఎం విశ్వకర్మ యోజన ప్రోగ్రాం కింద ఇప్పటి వరకు జిల్లాలో 16,193 దరఖాస్తులు రాగా స్టేజ్–1లో 14,430 దరఖాస్తులను క్లియర్ చేశామన్నారు. సమావేశంలో పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు, ఏపీఎస్ఎఫ్‌సీ బ్రాంచ్ మేనేజర్ కె.నరసింహారెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్‌మోహన్, జి.రాఘవరెడ్డి, విద్యుత్ శాఖ డీఈ కె.కృష్ణకాంత్, ఎల్‌డీఎం డి.రమేష్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

- లీడ్ బ్యాంక్ మేనేజర్ రమేష్



ఆర్థిక అక్షరాస్యతపై బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న ఎల్‌డీఎం రమేష్

ఒంగోలు సిటీ: ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాసత్యపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజరు రమేష్ పేర్కొన్నారు. గురువారం రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్ (డెఫ్) విభాగం ఆధ్వర్యంలో ఖాతాదారుల అక్షరాస్యత అవగాహన కార్యక్రమాన్ని ఒంగోలులోని ఏకెవీకే కళాశాలలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎల్‌డీఎం రమేష్ మాట్లాడుతూ సరైన ఆర్థిక విధానానికి ప్రతి ఒక్కరూ బ్యాంక్ అకౌంట్ కలిగి ఉండాలన్నారు. డిజిటల్ పేమెంట్స్ జరుపుకోవాలంటే కచ్చితంగా అకౌంట్ ఉండాలన్నారు. మీరు, మీ తల్లిదండ్రులు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన తదితర ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అర్హులందరూ దరఖాస్తు చేసుకునే విధంగా విద్యార్థులు కృషి చేయాలని చెప్పారు. రూడ్ సెట్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఆర్థికంగా ఎదిగేందుకు రూడ్‌సెట్ ద్వారా నాణ్యమైన శిక్షణ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్టేట్ కో ఆర్డినేటర్ కె.అశోక్, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ శ్రీను, కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరెడ్డి సీఎఫ్ఎల్ కౌన్సిలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒంగోలులో భారీ చోరీ

- రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి ఇంట్లో 20 సవర్ల బంగారం, కేజీ వెండి, రూ.50 వేల నగదు అపహరణ
- త్రోవగుంటలో 3 సవర్లు, కంభంలో 3 సవర్ల బంగారం, నగదు దోపిడీ



ఒంగోలులో చోరీ జరిగిన ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న సీఐ అజయ్‌కుమార్

ఒంగోలు సిటీ: జిల్లాలో దొంగలు రెచ్చిపోయారు. పక్కాగా రెక్కీ చేసి చేతివాటం ప్రదర్శించారు. బుధవారం రాత్రి, గురువారం వేర్వేరు ప్రాంతాల్లో చోటుచేసుకున్న 3 చోరీ ఘటనల్లో బాధితులు భారీ మొత్తంలో బంగారం, వెండి, నగదు కోల్పోయారు. వివరాల్లోకి వెళ్తే.. ఒంగోలు నగరంలోని కర్నూలు రోడ్డులో ఆంధ్ర కేసరి నగర్‌లో నివాసం ఉంటున్న రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగి పాండురంగారావు తన భార్యకు అనారోగ్యంగా ఉండడంతో చికిత్స నిమిత్తం మూడు రోజుల క్రితం మార్కాపురం వెళ్లారు. బుధవారం రాత్రి ఆయన నివాసంలో చోరీ జరిగినట్లు గమనించిన ఇరుగుపొరుగు వారు పాండురంగరావుకు సమాచారం ఇచ్చారు. గురువారం ఆయన ఇంటికి వచ్చి చూడగా బీరువాలో దాచి ఉంచిన 20 సవర్ల బంగారం, కిలో వెండి, 50 వేల రూపాయల నగదు కనిపించలేదు. తాలూకా సీఐ అజయ్ కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

☛ త్రోవగుంట సమీపంలో చీరాల రోడ్డులో బొచ్చు అంజమ్మ అనే వృద్ధురాలు రోజువారీ కూలీ పనులు చేస్తూ జీవిస్తోంది. బుధవారం సాయంత్రం నెల్లూరులో ఉంటున్న కుమార్తె వద్దకు వెళ్లి గురువారం మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చింది. తలుపు తొలగించి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉంచిన 3 సవర్ల బంగారు ఉంగరాలు కనిపించలేదు. తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

మిర్చి కోతకు వెళ్లొచ్చే సరికి ఇల్లు లూటీ

కంభం: తాళం వేసి ఉన్న ఇంట్లో పట్టపగలే దొంగలు పడి నగలు, నగదు అపహరించుకెళ్లిన సంఘటన కంభం మండలంలోని దరగా గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నారుబోయిన చిన్న ఆవులయ్య, అతని భార్య గురువారం ఉదయం మిర్చి కోతకు అర్ధవీడు మండలంలోని కాకర్లకు వెళ్లారు. పని ముగించుకొని సాయంత్రం 5 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉంది. బీరువాలో రెండున్నర తులాల కమ్మలు, ముక్కుపుడక, ఇతర బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదు కనిపించలేదు. సంఘటనా స్థలాన్ని ఏఎస్సై సుధాకర్ పరిశీలించారు. మార్కాపురం క్లూస్ టీం బృందం ఆధారాలు సేకరించింది.

లక్ష్యంపై గురి తప్పకూడదు

- పోలీస్ అధికారులకు ఎస్పీ దామోదర్ సూచన
- చీమకుర్తి వద్ద గన్ ఫైరింగ్ సాధన



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

చీమకుర్తి రూరల్: ‘ప్రతి బుల్లెట్ లక్ష్యాన్ని ఛేదించేలా తర్ఫీదు పొందాలి, అత్యవసర సమయాల్లో ప్రజల, ప్రభుత్వ ధన, ప్రాణ రక్షణకై ఎల్లవేళలా సంసిద్ధులై ఉండాల’ని పోలీస్ అధికారులు, సిబ్బందికి ఎస్పీ ఏఆర్ దామోదర్ దిశానిర్దేశం చేశారు. చీమకుర్తి మండలంలోని రామతీర్థం సమీపంలో జిల్లా ఫైరింగ్ రేంజ్ ప్రాక్టీసులో ఎస్పీ పాల్గొన్నారు. పోలీసు అధికారులకు నిర్వహించిన వార్షిక ఫైరింగ్ సాధనను సందర్శించారు. ఫైరింగ్ ప్రక్రియలో మెళకువలు నేర్చుకుని, సందేహాలను నివృత్తి చేసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, డీఎస్పీలు లక్ష్మీ నారాయణ, నాగరాజు, సాయి ఈశ్వర్ యశ్వంత్, కె.శ్రీనివాసరావు, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌స్టాగ్రాంలో పరిచయం చేసుకుని.. గర్భవతిని చేసి

దర్శి(కురిచేడు): ఇన్‌స్టాగాంలో పరిచయమైన 8వ తరగతి విద్యార్థినిని ఓ యువకుడు గర్భవతిని చేసిన సంఘటన గురువారం ప్రకాశం జిల్లా దర్శి పట్టణంలో వెలుగుచూసింది. ఈ సంఘటనపై దర్శి ఎస్సై మురళి కేసు నమోదు చేసి విద్యార్థినిని వైద్య పరీక్షల నిమిత్తం ఒంగోలులోని గవర్నమెంట్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఎస్సై మురళి తెలిపిన వివరాల మేరకు.. దర్శి మున్సిపాలిటీ పరిధిలోని సాయినగర్‌కు చెందిన 19 సంవత్సరాల యువకుడు బేల్దారి పనులు చేసుకుంటూ అన్నమయ్య జిల్లా ప్రొద్దుటూరులో నివసిస్తున్నాడు. అతనికి పల్నాడు జిల్లా సరికుంటపాడు గ్రామానికి చెందిన 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఇన్‌స్టాగాంలో పరిచయమైంది. ఆ విద్యార్థిని వినుకొండలోని ఎస్సీ బాలికల హాస్టల్లో ఉంటూ అక్కడే బాలికోన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తోంది. విద్యార్థిని సెలవులకు ఇంటికి వెళ్లినపుడు సెల్‌ఫోన్ వినియోగించేది. ఫోన్ వాడకుండా విద్యార్థినిని ఆమె తల్లి అదుపుచేసే ప్రయత్నం చేసింది. అందుకు అలిగిన విద్యార్థిని.. ఇంట్లో చెప్పకుండా తన ఇన్‌స్టాగాం స్నేహితుడు వద్దకు ప్రొద్దుటూరు వెళ్లింది. అక్కడ ఇద్దరూ కలిసి ఇల్లు అద్దెకు తీసుకుని సహజీవనం చేస్తూ కూలి పనులకు వెళ్తున్నారు. విద్యార్థిని కనిపించకపోవడంతో ఆమె సోదరుడు వినుకొండ పోలీసులకు బాలిక మిస్సింగ్ అంటూ ఫిర్యాదు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థిని గత నెల 2వ తేదీ దర్శి మండలంలోని తానంచింతల గ్రామంలో ఉన్న అమ్మమ్మ వద్దకు చేరింది. అక్కడి నుంచి ఆమె అన్న, తల్లి వారింటికి తీసుకెళ్లారు. ఇటీవల ఆరోగ్యం బాగాలేదని చెప్పడంతో దర్శిలోని ప్రైవేటు వైద్యశాలలో వైద్యపరీక్షలు చేయించగా, ఆమె గర్భవతి అని వైద్యులు నిర్ధారించారు. ఈ విషయంపై బాధితురాలి కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విషయం బయటకు పొక్కింది. దర్శి పోలీసులు విద్యార్థినిని తదుపరి వైద్యపరీక్షల నిమిత్తం ఒంగోలు తరలించి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

వరిగడ్డి లోడు లారీ దగ్ధం



యర్రగొండపాలెం: మండలంలోని వీరభద్రాపురంలో విద్యుత్ తీగలు తగిలి వరిగడ్డి లోడుతో వెళ్తున్న లారీ దగ్ధమైంది. ఈ సంఘటన గురువారం జరిగింది. ఈ సంఘటనలో రూ.1.90 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. వివరాల్లోకి వెళితే.. వీరభద్రాపురం గ్రామానికి చెందిన కొంతమంది పశుపోషకులు కృష్ణ జిల్లా వడ్లమన్నాడు గ్రామం నుంచి రూ.60వేలు విలువైన వరిగడ్డిని లారీలో తీసుకొని వచ్చారు. పశుపోషకులు చెప్పిన ప్రాంతానికి లారీ వెళ్తున్న సమయంలో ఆ గ్రామంలో కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. లారీ డ్రైవర్ అప్రమత్తమై లారీని ఊరి బయట నిర్మానుష ప్రాంతానికి తీసుకువెళ్లాడు. అగ్నిమాపక శాఖాధికారి జీవీ రవి ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపులోనికి తీసుకున్నారు.